క్లుప్తంగా

తల్లికి వందనం

నెహ్రూనగర్: తల్లికి వందన కార్యక్రమంలో భాగంగా శుక్రవారం గుంటూరులోని వాసవీ నగర్‌లో చిన్నారులకు ఆటల పోటీలు, పిల్లలను దీవించే కార్యక్రమాలను నిర్వహించారు. అర్బన్ సీడీపీఓ టి. కృష్ణవేణి పాల్గొన్నారు.

రేపు ఉచిత వైద్య శిబిరం

గుంటూరు మెడికల్: సర్వీస్ హెల్త్ ఆర్గనైజేషన్ హైపర్ టెన్షన్ అండ్ డయాబెటిక్ క్లబ్, మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం ఆర్థోపెడిక్ ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు ఆ సంస్థల అధ్యక్షులు డాక్టర్ టి.సేవకుమార్, పావులూరి రమేష్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక బ్రాడీపేట 2వలైనులోని ఎస్‌హెచ్‌ఓ భవనంలో నిర్వహించే ఈ వైద్య శిబిరంలో ప్రముఖ ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ పి.సీతారాం ప్రసాద్ పాల్గొంటారన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాల్సిందిగా కోరారు.

రైతు, కార్మిక సంఘాల సమ్మెను జయప్రదం చేయండి



లక్ష్మీపురం: దేశవ్యాప్తంగా ఈనెల 20వ తేదీ చేపట్టిన సార్వత్రిక సమ్మెను రైతు, కార్మిక సంఘాలు జయప్రదం చేయాలని ఆయా సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. స్థానిక పీఎల్ రావు భవన్‌లో రైతు, కార్మిక సంఘాల సమావేశం శుక్రవారం నిర్వహించారు. అనంతరం నాయకులు కంచుమాటి అజయ్, పచ్చల శివాజీ, పాశం రామారావు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు ఈమని అప్పారావు, మన్నవ హరిప్రసాద్, నాయకులు దండా లక్ష్మీ నారాయణ, మేడా హనుమంతరావు, ఎ.అరుణ్ కుమార్, బి.లక్ష్మణరావు, ఎస్.వేణుగోపాల్ రావు, నాగమల్లేశ్వరరావు, బొట్ల రామకృష్ణ, కంజుల విఠల్ రెడ్డి విలేకరులతో మాట్లాడారు.

జీజీహెచ్ పరిశుభ్రతకు సహకరించాలి

సూపరింటెండెంట్ యశస్వి రమణ



గుంటూరు మెడికల్: స్థానిక జీజీహెచ్‌లో పరిశుభ్రత కోసం ప్రతి ఒక్కరూ నిబంధనలు పాటించాలని ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ యశస్వి రమణ పేర్కొన్నారు. ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన మీ కోసం మేము కార్యక్రమం 13వ వారం శుక్రవారం విజయవంతంగా నిర్వహించారు. డాక్టర్ రమణ రోగులతో డాక్టర్ పేషెంట్ ఇంటరాక్షన్ కార్యక్రమాన్ని చేపట్టారు. ఆస్పత్రిలో ఉన్న రోగుల సహాయకులకు వేసవి కాలంలో ఆహార నియమావళి గురించి వివరించారు. వైద్య సేవలు మెరుగ్గా అందించేందుకు సిబ్బందితో సహకరించాలని సూచించారు. సమస్యలు తమ దృష్టికి తీసుకొస్తే తక్షణమే పరిష్కరించి మెరుగైన చికిత్స అందించేందుకు కృషి చేస్తామని డాక్టర్ రమణ హామీ ఇచ్చారు. అంతర్జాతీయ నర్సింగ్ దినోత్సవం సందర్భంగా పేద రోగుల సహాయకులకు 25 కేజీ బియ్యాన్ని నర్సింగ్ సిబ్బంది పంపిణీ చేశారు.

గాంధీ, నెహ్రూలపై అనుచిత వ్యాఖ్యలు..

శ్రుష్టి వర్మాపై ఫిర్యాదు




లక్ష్మీపురం: మహాత్మాగాంధీ, నెహ్రూలపై కొరియోగ్రాఫర్ శ్రుష్టి వర్మా వ్యాఖ్యలకు నిరసనగా ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు కరీం ఆధ్వర్యంలో హిందూ కళాశాల సెంటర్‌లో శుక్రవారం దిష్టిబొమ్మను దహనం చేశారు. దీంతో పోలీసులు అడ్డుకున్నారు. కొద్ది సేపు హిందూ కళాశాల సెంటర్‌లో శ్రుష్టి వర్మాకు వ్యతిరేకంగా నినాదాల హోరెత్తించారు.

పోలీసులకు ఫిర్యాదు..

మహాత్మాగాంధీ, నెహ్రూలపై కొరియోగ్రాఫర్ శ్రుష్టి వర్మ వ్యాఖ్యలపై ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు కరీం ఫిర్యాదు మేరకు నగరంపాలెం పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడైన షేక్ కరీం ఈనెల 3వ తేదీన సెల్‌ఫోన్‌లో ఆన్‌లైన్ ఇన్‌స్ట్రాగామ్‌కి అనుసంధానమైన ట్రెడ్స్ అను యాప్‌లో బ్రౌజింగ్ చేస్తుండగా శ్రుష్టి వర్మా ఇన్‌స్టా గ్రామ్ ఖాతా నుంచి దేశ జాతిపిత మహాత్మాగాంధీ, దేశ మొట్ట మొదటి ప్రధాన మంత్రి జవహర్ లాల్ నెహ్రూలను బాస్టర్డ్ అంటూ ఈ దేశానికి సర్వనాశం చేసి వెళ్లిపోయారు.. రాబోయే రోజుల్లో వీళ్ల గురించి కాకుండా నిజమైన పోరాటం చేసిన వారి గురించి మాట్లాడుకోవాలని, అదే విధంగా చదువుకునేటటువంటి పాఠ్య పుస్తకాలలో మహాత్మాగాంధీ, చరిత్రను, నెహ్రూ చరిత్రలను తీసి వేయాలంటూ అసభ్యకరంగా మాట్లాడారు. శ్రుష్టి వర్మాపై చట్ట పరమైన చర్యలు తీసుకోవాల్సిందిగా ఫిర్యాదు చేశారు. నగరంపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు.

లూపస్ వెరీ డేంజరస్

- వ్యాధి గుర్తించేలోగా మృత్యువాత
- ప్రాథమిక దశలో గుర్తిస్తే నియంత్రవచ్చు
- నేడు వరల్డ్ లూపస్ డే



గుంటూరు మెడికల్: గుంటూరు బ్రాడీపేటకు చెందిన 25 ఏళ్ల సుజాతకు వివాహమై ఐదేళ్లు అయినా సంతానం కలుగలేదు. ఆరు నెలలుగా కీళ్ల నొప్పులు ఉన్నా పట్టించుకోకుండా తన రోజువారీ పనులు చేసుకుంటుంది. నొప్పులకు తోడు ఆయాసం రావటంతో ఆస్పత్రికి వెళ్లింది. డాక్టర్లు పరీక్షలు చేసి రెండు కిడ్నీలు ఫెయిల్ అయ్యాయని దీనికి కారణం లూపస్ వ్యాధి అని నిర్ధారించారు. ప్రజలతోపాటుగా వైద్యులకు కూడా సరైన అవగాహన లేకపోవటం వలన ముందస్తుగా వ్యాధిని గుర్తించలేకపోతున్నట్లు వైద్య నిపుణులు అభిప్రాయపడుతున్నారు. అవగాహన కోసం ఈనెల 10న ప్రపంచ లూపస్ డే నిర్వహిస్తున్నారు.

వ్యాధికి కారణాలు..

లూపస్ అంటే లాటిన్‌లో తోడేలు అని అర్థం. ఈవ్యాధి ఆటోఇమ్యూన్ వ్యాధి. ఈ వ్యాధి ఎందుకు వస్తుందో, ఎలా ప్రవర్తిస్తుందో కారణాలు పూర్తిగా తెలియదు. సాధారణంగా శరీరంలో ఉన్న ఇమ్యూనిటీ సిస్టమ్ బయటి నుంచి వచ్చే ఇన్‌ఫెక్షన్‌లు, ఫారిన్‌బాడీస్‌ను ఎదుర్కొని మన శరీరాన్ని ఆరోగ్యంగా ఉంచడానికి తోడ్పడుతుంది. ఇమ్యూనిటిసిస్టమ్‌లో లోపాలు వలన శరీరంలో వివిధ అవయవాల్లో ఉండే సాధారణ కణాలు ఫారిన్‌బాడీస్‌వల్లే గుర్తింపబడి సాధారణ కణాలు విచ్చినమై అవయవాలు దెబ్బతినడం వలన లూపస్ వ్యాధి వస్తుంది.

జిల్లాలో బాధితులు...

వ్యాధి ముఖ్యంగా మహిళల్లో వస్తుంది. ప్రతి పది మంది వ్యాధిగ్రస్తుల్లో 8 మంది మహిళలే. 18 నుంచి 45 వయస్సులో ఉన్న వారికి ఈవ్యాధి వస్తుంది. మగవారిలో, చిన్నపిల్లల్లో, వృద్ధాప్యంలో ఉన్నవారికి వ్యాధి వస్తే తీవ్రత ఎక్కువగా ఉంటుంది. ప్రపంచ వ్యాప్తంగా లక్ష జనాభాలో వంద మంది లూపస్ వ్యాధి బాధితులు ఉన్నారు. గుంటూరులో నలుగురు రుమటాలజీ వైద్య నిపుణులు ఉన్నారు. ప్రతినెలా ఒక డాక్టర్ వద్దకు పది మంది బాధితులు చికిత్స కోసం ఆస్పత్రికి వస్తున్నట్లు వైద్యులు చెబుతున్నారు.

వ్యాధి లక్షణాలు

వ్యాధి ఏ క్షణంలోనైనా, ఏవిధంగానైనా, ఏ అవయవాన్నైనా దెబ్బతిస్తుంది. తల నుంచి కాళ్ల వరకు, కిడ్నీల నుండి గుండె వరకు అన్ని అవయవాలపై ఈ వ్యాధి దాడికి దిగి అవయవాలను తీవ్రంగా దెబ్బతీస్తుంది. దీర్ఘకాలంగా జ్వరం ఉండటం, బరువు తగ్గడం, విపరీతమైన నీరసం, కీళ్ల నొప్పులు, జుట్టు రాలడం, నోటిపూత, రక్త కణాలు తగ్గడం, మూత్రపిండాలు పాడవడం, మూర్ఛవ్యాధి, అబార్షన్లు, పిల్లలు లేకపోవటం, బహిష్టు సమయంలో అధిక రక్తస్రావం, ముఖంపై, శరీరంపై సీతాకోక చిలుక ఆకారంలో దద్దుర్లు కనిపించడం వ్యాధి లక్షణాలు.

అవగాహనతో నియంత్రణ



అనుభవజ్ఞులైన వైద్యుల సమక్షంలో తగిన మోతాదులో సరైన సమయంలో మందులు వాడితే వ్యాధిని నియంత్రణలో పెట్టవచ్చు. క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం, ఒత్తిడి తగ్గించుకోవడం, మంచి ఆహారం తీసుకోవడం, మద్యపానం, ధూమపానానికి దూరంగా ఉండటం, సూర్యరశ్మి నుంచి తగిన జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా వ్యాధి పూర్తి నియంత్రణలో ఉంటుంది. సరైన చికిత్స తీసుకోని పక్షంలో మరణాలు సంభవించే అవకాశం ఉంది. తొలిదశలోనే గుర్తించి నియంత్రణలో పెట్టడం ద్వారా మరణాలు సంభవించకుండా చూడవచ్చు.

– డాక్టర్ మానుకొండ మురళీకృష్ణ, రుమటాలజిస్టు, గుంటూరు

తొలిదశలో గుర్తించవచ్చు

పైన పేర్కొన్న లక్షణాలు ముఖ్యంగా యుక్తవయస్సులో ఉన్న ఆడవారిలో కనిపిస్తే తక్షణమే రుమటాలజిస్టును సంప్రదిస్తే ఏఎన్‌ఏ, డీఎస్ డీఎన్‌ఏ రక్తపరీక్షల ద్వారా వ్యాధిని తొలిదశలోనే గుర్తించి చికిత్స అందించవచ్చు. లూపస్‌వ్యాధి నిర్ధారణ చేసే సమయానికే కనీసం మూడేళ్ల ముందుగానే శరీరంలో మార్పులు జరుగుతాయి. హార్మోన్ల అసమతుల్యత వల్ల, జన్యుపరమైన లోపాల వల్ల వివిధ పర్యావరణ కారకాల వల్ల వ్యాధి సంభవిస్తుంది.

ఆపరేషన్ సిందూర్ విజయవంతం



మాట్లాడుతున్న హరి

లక్ష్మీపురం: భారత సైన్యం నిర్వహించిన ఆపరేషన్ సిందూర్ విజయవంతం కావడం హర్షణీయమని అవగాహన సంస్థ సభ్యులు పేర్కొన్నారు. అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో శుక్రవారం ఆపరేషన్ సిందూర్‌లో పాల్గొన్న సైనికులను అభినందిస్తూ ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. రాజ్యాంగ చర్చావేదిక కార్యదర్శి, న్యాయవాది ఎ.హరి మాట్లాడుతూ పాక్ ఆక్రమిత కశ్మీర్‌లో, పాకిస్థాన్‌లో ఉగ్రవాద శిబిరాలను, వాటి మౌలిక సదుపాయాలను దెబ్బతీసే లక్ష్యంతో సాయుధబలగాలు నిర్వహించిన ఆపరేషన్ దేశ ప్రజల్లో స్ఫూర్తిని నింపిందన్నారు. 26 మంది పర్యాటకుల ప్రాణాలు బలిగొన్న పహల్గాం ఉగ్రదాడి ఘటనపై దేశ వ్యాప్తంగా తీవ్ర స్థాయిలో ఆగ్రహావేశాలు వ్యక్తమైన నేపథ్యంలో అన్ని రాజకీయ పార్టీల అంగీకారంతో కేంద్రం ఆపరేషన్ సిందూర్ నిర్వహించడం గొప్ప విషయమన్నారు. పాకిస్థాన్‌లోని సాధారణ ప్రజానికానికి, సైన్యానికి ఎటువంటి హాని జరగకుండా దాడి కొనసాగించడం మంచి పరిణామమన్నారు. విద్యావేత్త ఆర్.వి.సింగరయ్య మాట్లాడుతూ భారత్‌తో పెట్టుకుంటే ఏమవుతుందో జగడాల మారి పాకిస్థాన్‌కు, దానికీలుబొమ్మలైన ఉగ్ర మూకలకు ఆపరేషన్ సిందూర్‌తో భారత్ విషయం తెలిసొచ్చిందన్నారు. కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి, సభ్యులు జనార్ధనరావు పాల్గొన్నారు.

జవాన్ మురళీనాయక్ త్యాగం మరువలేనిది



షేక్ నూరిఫాతిమా

పట్నంబజారు: యుద్ధంలో వీరమరణం పొందిన జవాన్ మురళీనాయక్ త్యాగాన్ని దేశం ఎప్పటికీ మరువదని వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షురాలు, తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త షేక్ నూరిఫాతిమా శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నాయక్ కుటుంబానికి భగవంతుడు శక్తి, మనోబలాన్ని ఇవ్వాలని ఆకాంక్షించారు. భారత దేశం తన శక్తిని ప్రపంచానికి చాటిచెప్పిందని, భరతమాత మట్టి జోలికి వస్తే పరిణామాలు ఏవిధంగా ఉంటాయో తెలియజెప్పిందన్నారు. భారతీయులంతా ఒక్కటేనని చెప్పారు. మన సైన్యం ఎంతో ధైర్యంగా శత్రు స్థావరాలను ధ్వంసం చేసిందని, మన జవాన్‌ల తెగింపు చరిత్రలో నిలిచిపోతుందన్నారు. దేశ ప్రజల రక్షణ కోసం ప్రాణాలు ఫణంగా పెట్టి పోరాడుతున్న ప్రతి జవాన్‌కు మంచి జరగాలని, భారత దేశం ఏ ఒక్క తలవంచదన్న విషయాన్ని జవాన్లు చాటి చెప్పారని పేర్కొన్నారు. జవాన్ మురళీనాయక్ ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షించారు.

నేడు అరుణాచలానికి ప్రత్యేక ఆర్టీసీ బస్సు

పట్నంబజారు: శివ భక్తుల కోసం అరుణాచలంలో జరిగే పౌర్ణమి గిరి ప్రదక్షిణకు ప్రత్యేక బస్సు సర్వీసు ఏర్పాటు చేస్తున్నట్లు ఏపీఎస్‌ఆర్టీసీ ఆర్ఎం ఎం.రవికాంత్ శుక్రవారం తెలిపారు. ఈనెల 12న పౌర్ణమి పురస్కరించుకుని శనివారం రాత్రి 9.15 గంటలకు గుంటూరు ఆర్టీసీ బస్టాండ్ నుంచి బస్సు బయలుదేరుతోందని చెప్పారు. 11వ తేదీ గోల్డెన్ టెంపుల్, కాణిపాకం, శ్రీకాళహస్తి దర్శించుకుని అదే రోజు రాత్రి అరుణాచలం చేరుకుంటుందని పేర్కొన్నారు. గిరిప్రదక్షిణ, స్వామి దర్శనం పూర్తయిన తరువాత అదేరోజు రాత్రి బయల్దేరి 13వ తేదీ ఉదయం గుంటూరు చేరుకుంటుందని వివరించారు. ఈ సర్వీసుకు సంబంధించి 96164 నంబరు ద్వారా ఆన్‌లైన్‌లో రిజర్వేషన్ చేసుకోవాలని సూచించారు. టికెటు ధర రూ.2,420 నిర్ణయించినట్లు చెప్పారు. మరింత సమాచారం కోసం 7382897459లో సంప్రదించాలని కోరారు.

ద్విచక్ర వాహనం చోరీ

లక్ష్మీపురం: ఇంటి ముందు పార్క్ చేసిన బైక్ చోరీకి గురైన ఘటనపై శుక్రవారం అరండల్‌పేట పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలు.. అమరావతి రోడ్డు బీరువాల బజార్ ప్రాంతానికి చెందిన షేక్ ఆయేషా డెంటల్ ఆస్పత్రిలో రిసెప్షనిస్ట్‌గా పని చేస్తున్నారు. ఈనెల 3వ తేదీన ద్విచక్ర వాహనాన్ని ఇంటి ముందు పార్కింగ్ చేసి మరుసటి రోజు ఉదయం చూసేసరికి వాహనం కనిపించలేదు. దీంతో చుట్టు పక్కల పరిశీలించి, ఎంత వెతుకలాడిన వాహనం కనిపించక పోవడంతో అరండల్‌పేట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మురుగుతో దుకాణాల మూత



డ్రెయిన్ నిర్మాణం చేపట్టకపోవడంతో స్టేషన్‌రోడ్డులో మూతపడిన దుకాణాలు

- నెలలు గడిచిన నిర్మాణాల్లేవు..
- మురుగు కాల్వలు వెంబడి నడవాలంటే కష్టమే..
- అడుగడుగునా పాలకులు, అధికారుల నిర్లక్ష్యం...



కొరిటెపాడు లైబ్రరీ సెంటర్‌లో నెలల తరబడి ఇలా..

నగరంపాలెం: అధికారుల నిర్లక్ష్యంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. డ్రెయిన్ల పనులు ప్రారంభించి పూర్తి చేయకపోవడంతో ఇబ్బందులు తప్పడం లేదు. ప్రధాన రహదారుల వెంబడి నడిచి వెళ్లేందుకు పాదచారులు, చోదకులు నరకయాతనకు గురవుతున్నారు. వివరాలు.. నాజ్ సెంటర్ నుంచి గుంటూరు రైల్వేస్టేషన్‌కు వెళ్లే స్టేషన్‌రోడ్డు ఇరువైపులా మురుగు కాల్వలు అధ్వానంగా మారాయి. గతంలో సైడు కాల్వలు కొత్తగా నిర్మించాలనే ప్రతిపాదనలతో కొద్ది నెలల క్రితం కాలువలను పగులకొట్టారు. దీంతో ఇరువైపులా దుకాణదారులు చెక్క బల్లలను ఏర్పాటు చేసుకున్నారు. తద్వారా కొనుగోళ్లుదారులకు వీలుగా ఉండేది. అయితే నెలలు గడిచినా సైడు కాల్వల నిర్మాణ పనులు ప్రారంభించలేదు. చేసేది ఏమిలేక కొందరు దుకాణదారులు సొంత ఖర్చులతో కాల్వలపై సిమెంట్ బల్లలను ఏర్పాటు చేసుకున్నారు. మిగతా దుకాణదారులు దుకాణాలను ఖాళీ చేసి వెళ్లిపోయారని స్థానికులు చెబుతున్నారు. మురుగునీరు ముందుకు కదలక అక్కడే నిలిచిపోతుంది. హోటళ్లు, లాడ్జిల్లో నుంచి వ్యర్థాలు నీరంతా స్తంభించడంతో భరించలేని దుర్వాసన వెదజల్లుతోంది. కార్పొరేషన్ పారిశుద్ధ్య అధికారులు మాత్రం వాసన రాకుండా బ్లీచింగ్ పౌడర్‌లు చల్లుతున్నారు. అయినా అటుగా వెళ్లే చోదకులు, పాదచారులు నడవాలంటే ముక్కు మూసుకోవాల్సిన పరిస్థితి నెలకొంది.

- కొరిటెపాడు లైబ్రరీ కూడలిలోనూ మురుగు కాల్వ మరింత అధ్వానంగా తయారైంది. కొద్ది మేరకు ఒకవైపు సైడు కాల్వను పగులకొట్టి అమాంతం వదిలేశారు. దీంతో నెలలు తరబడిగా అదే పరిస్థితి నెలకొంది. ఎవరూ పట్టించుకునే వారు ఉండటంలేదు. అటుగా మున్సిపల్ అధికారులు, పాలకులు పొద్దస్తమానం రాకపోకలు చేస్తున్నా.. ఏమాత్రం దానిపై దృష్టిసారించడంలేదు. అటుగా వెళ్లేటప్పుడు మురుగు కాల్వలోని దుర్వాసన ఒక్కసారిగా గుప్పుమని వెదజల్లుతుంది. ఎన్నిమార్లు స్థానిక అధికారుల దృష్టికి తీసుకువచ్చిన ప్రయోజనం ఉండటంలేదని దుకాణదారులు వాపోతున్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కొరిటెపాడు(గుంటూరు): విద్యుత్ మరమ్మతుల దృష్ట్యా శనివారం సరఫరా నిలిపివేయనున్నట్లు టీ–4 డీఈఈ పీహెచ్ ఖాన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు అంతరాయం ఉంటుందని చెప్పారు. 11 కేవీ బాలాజీ నగర్ ఫీడర్, యాదవుల బజారు ఫీడర్‌లో పరిధిలో సత్యనారాయణ స్వామి గుడి, బూరెల వారి వీధి, యాదవుల బజార్, లక్ష్మీనగర్, బాలాజీ నగర్ 7వ లైను నుంచి 11వ లైన్ వరకు వినియోగదారులు సహకరించాలని కోరారు.

- 11 కేవీ లైన్ మరమ్మతుల దృష్ట్యా జేకేసీ రోడ్, విజయపురి కాలనీ, తారకరామ నగర్, వికాస్ నగర్, శ్యామలానగర్, స్తంభాల గరువు, బృందావన్ గార్డెన్స్, గుజ్జనగుండ్ల, ఎస్‌వీఎన్ కాలనీ, రాజేంద్రనగర్, ఇన్నర్ రింగ్ రోడ్, అన్నపూర్ణనగర్, మల్లికార్జునపురం, అమరావతి రోడ్, గోరంట్ల, నగరాలు, హోసన్న మందిర్ ఏరియాల్లో సరఫరా నిలిపివేయనున్నట్లు టీ–2 డీఈఈ ఎస్.గురవయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.
- 33 కేవీ ఫీడర్‌లో చెట్ల కొమ్మలు తొలగించుట, లైన్ మెయింటెనెన్స్ దృష్ట్యా చంద్రమౌళినగర్, లక్ష్మీపురం, బ్రాడీపేట, కృష్ణనగర్, పట్టాభిపురం, కోబాల్ట్‌పేట, అశోక్‌నగర్, కొరిటెపాడు, హనుమయ్యనగర్, రెడ్ల బజారు, రామన్నపేట, నాయుడుపేట తదితర ప్రాంతాల్లో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు సరఫరా నిలిపివేయనున్నట్లు టౌన్–2 డీఈఈ ఎస్.గురవయ్య తెలిపారు.
- 11 కేవీ సబ్ స్టేషన్ మరమ్మతుల నిమిత్తం సంగడిగుంట పరిధిలోని బరమ్ హిమాపంజ రోడ్, చిన్న బజారు, ఏక్ మినార్ మసీదు రోడ్, లాంచెస్టర్ రోడ్, ఏటుకూరు రోడ్, ఐపీడీ కాలనీ, ఇందిరా కాలనీ, బావాజీ నగర్, ఎల్ఆర్ కాలనీ, పొన్నూరు రోడ్, హుస్సేన్ నగర్, సీబీఎస్ కాలనీ, హుడా రోడ్ తదితర ప్రాంతాల్లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సరఫరా నిలిపివేయనున్నట్లు టౌన్–1 డీఈఈ షేక్ ముస్తాక్ అహ్మద్ తెలిపారు. పేట, లాలాపేట, ఆనందపేట, బస్టాండ్ రోడ్, కొత్తపేట, రైల్వే స్టేషన్ రోడ్, పాత్తూరివారి తోట, గుంటూరువారితోట, గణేశ్వరరావుపేట, రామిరెడ్డి తోట తదితర ప్రాంతాల్లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు డీఈఈ షేక్ ముస్తాక్ అహ్మద్ శుక్రవారం తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

కోర్టు కేసులపై ప్రత్యేక దృష్టి సారించాలి



విభాగాధిపతులతో మాట్లాడుతున్న కమిషనర్ పులి శ్రీనివాసులు

నెహ్రూనగర్: నగరపాలకు సంస్థకు సంబంధించి కోరు కేసులను ఈనెల 20 నాటికి విభాగాల వారీగా వివిధ పరిష్కారంపై ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదేశించారు. శుక్రవారం కమిషనర్ తమ చాంబర్‌లో కోర్టు కేసుల పురోగతి, పెండింగ్ అంశాలపై విభాగాధిపతులు, సూపరింటెండెంట్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. తొలుత విభాగాల వారీగా ఉన్న కేసులు, తీర్పు వచ్చిన కేసులు, పెండింగ్ ఉన్నవి వివరాలు తెలుసుకున్నారు. వివిధ అంశాలపై ఆయా సంస్థలు, వ్యక్తులు ఫైల్ చేసిన కోర్టు కేసుల్లో ఎక్కువ శాతం పట్టణ ప్రణాళిక, ఇంజినీరింగ్ విభాగాలకు సంబంధించినవే అధికంగా ఉన్నాయని చెప్పారు. సమావేశంలో ఎస్ఈ నాగ మల్లేశ్వర రావు, సీఎంఓహెచ్ డాక్టర్ అమృతం, డిప్యూటీ కమిషనర్లు డి.శ్రీనివాసరావు, సిహెచ్.శ్రీనివాస్, డిప్యూటీ సిటి ప్లానర్ సూరజ్ కుమార్, మేనేజర్ బాలాజీ బాషా పాల్గొన్నారు.

అన్న క్యాంటీన్లలో అందించే ఆహారంపై ప్రజలు తమ అభిప్రాయాలను తెలియజేయాలని కమిషనర్ పులి శ్రీనివాసులు సూచించారు. శుక్రవారం ఆర్టీఓ ఆఫీస్ వద్ద ఉన్న అన్న క్యాంటీన్‌ను పరిశీలించారు. ప్రజలు తమ అభిప్రాయాలను క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి తెలియజేయవచ్చన్నారు.

వస్తువుల కొనుగోలులో అప్రమత్తంగా ఉండాలి



వినియోగదారులకు అవగాహన కల్పిస్తున్న డెప్యూటీ కంట్రోలర్ షాలెం రాజు

నెహ్రూనగర్: తూనికల కొలతల్లో మోసాలకు గురికావద్దని లీగల్ మెట్రాలజీ డెప్యూటీ కంట్రోలర్ షాలెంరాజు సూచించారు. లీగల్ మెట్రాలజీ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో శుక్రవారం గుజ్జనగుండ్లలోని డీ మార్ట్‌లో వినియోగదారులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వస్తువులను కొనుగోలు చేసిన తరువాత ఆ వస్తువుపై ఉన్న సమాచారం తప్పనిసరిగా వినియోగదారులు తెలుసుకోవాలన్నారు. ప్యాకేజ్ కమోడిటీ యాక్ట్ ప్రకారం ఉత్పత్తిదారుడు పేరు, బ్యాచ్ నంబర్, ఆ వస్తువు ఎప్పుడు తయారు చేసిన తేదీ, వస్తువు రేటు పన్నులు అన్ని కలుపుకుని, ఎప్పటి లోపల ఆ వస్తువును ఉపయోగించాలని అనే తేదీ, కస్టమర్ కేర్ నంబర్, ఈ మెయిల్ ఐడీ తప్పనిసరిగా ఉండాలన్నారు. జాతీయ వినియోగదారుల సమాఖ్య సీనియర్ ఉపాధ్యక్షులు డాక్టర్ చదలవాడ హరిబాబు మాట్లాడుతూ ఆహార పదార్థాలపై తప్పనిసరిగా పూర్తి వివరాలు ఉండాలన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కంట్రోలర్ జీ కొండారెడ్డి, ఇన్‌స్పెక్టర్ జీ సునీల్‌రాజు పాల్గొన్నారు.

మహారాణా ప్రతాప్‌సింగ్‌ను స్ఫూర్తిగా తీసుకోవాలి



రాజపుత్ర కార్తిక మధూరిసింగ్‌కు సత్కారం

నగరంపాలెం: స్థానిక బృందావన్‌గార్డెన్స్ శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయ ప్రాంగణం అన్నమయ్య కళావేదికపై మహారాణాప్రతాప్‌సింగ్ జయంతి వేడుకలు శుక్రవారం నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ బొందిలి సంఘం ఆధ్వర్యంలో జరగ్గా, ఆలయ పాలకమండలి అధ్యక్షులు సీహెచ్ మస్తానయ్య, ఉపాధ్యక్షులు లంకా విజయబాబు జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించారు. రామరాజు ఇన్‌ఫ్రా డెవలపర్స్ రామరాజు శ్రీనివాస్ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథి బి.జె.పి. రాష్ట్ర అధికార ప్రతినిధి వల్లూరు జయప్రకాశ్ నారాయణ మాట్లాడుతూ మహారాణాప్రతాప్‌సింగ్ పేరు హిందువుల గుండెల్లో ఉత్సాహాన్ని కలిగించేదని అన్నారు. భావితరాలు ఆయన చరిత్రను చదివి స్ఫూర్తిని పొందాలని చెప్పారు. బి.జె.పి.అర్బన్ జిల్లా మాజీ కార్యదర్శి రామకృష్ణ, నూతలపాటి తిరుపతయ్య, కె.శంకర్‌సింగ్, ఎస్.కృష్ణసింగ్, మోహన్‌సింగ్, తిరుప్పావై అమృతవర్షిణి, డాక్టర్ కోగంటి వేంకటశ్రీరంగనాయకి, షిండే లక్ష్మీనారాయణ, సంస్కార భారతి అధ్యక్షులు ఇండ్ల శ్రీధర్‌బాబు మాట్లాడారు. అనంతరం పత్రి గాయత్రీదేవి భక్తి గీతాలు ఆలపించారు. డాక్టర్ రాజపుత్ర మధూరివిజేతసింగ్, బాణాల వెంకటసాయిమణికంఠ, రాజపుత్ర కార్తిక మధూరిసింగ్‌ను, అతిథులను సత్కరించారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు క్షత్రి ధర్మనారాయణసింగ్, ఏపీ చత్రపతి శివాజీ చారిటబుల్ ట్రస్ట్ కార్యదర్శి జూజం సుబ్రహ్మణ్యం, బాణాల ఆంజనేయులు పాల్గొన్నారు.

న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలి



జిల్లా కలెక్టరేట్ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న జిల్లా కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్

లక్ష్మీపురం: కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని తెలంగాణ రాష్ట్ర నర్సింగ్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు నక్కా సూర్యకుమార్ పేర్కొన్నారు. స్థానిక జిల్లా కలెక్టరేట్ వద్ద కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ చేపట్టిన సమ్మె శుక్రవారానికి 12వ రోజుకు చేరింది. దీక్ష శిబిరానికి మద్దతు తెలిపిన ఆయన మాట్లాడుతూ ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ మానవత దృక్పథంలో చర్చలకు పిలిచి సమస్యపై శ్రద్ధ పెట్టాలని కోరారు. అడుగుతున్న వేతన సవరణ అంశం, పెండింగ్ బకాయిలు గొంతెమ్మ కోరికలు కాదు అన్నారు. కార్యక్రమంలో గుంటూరు జిల్లా అధ్యక్షురాలు టి.ప్రవళిక, వైస్ ప్రెసిడెంట్ జి.వనజ, ఆంధ్రప్రదేశ్ నర్సింగ్ పోరాట కమిటీ అధ్యక్షులు స్వచ్ఛంద ప్రసాద్ , ఏపీ ఎంసీఏ కో ఆర్డినేటర్ దీక్షత, జిల్లా జనరల్ సెక్రటరీ పల్లపాటి లింగరాజు, జిల్లా నాయకులు జ్యోత్స్న పాల్గొన్నారు.

నిరుద్యోగ యువతకు ఉద్యోగ కల్పనే లక్ష్యం



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి

గుంటూరు రూరల్: నిరుద్యోగ యువతకు ఉద్యోగ కల్పన లక్ష్యంతో దేశంలోని 48 ప్రముఖ కంపెనీల ద్వారా ఏర్పాటు చేసిన మెగా జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి కోరారు. శుక్రవారం వట్టిచెరుకూరు మండలం పుల్లడిగుంటలోని మలినేని లక్ష్మయ్య మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో జాబ్ మేళా నిర్వహించారు. స్థానిక ఎమ్మెల్యే బి.రామాంజనేయులు, ఎస్పీ సతీష్‌కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ నాగలక్ష్మి మాట్లాడుతూ.. నూతన ప్రభుత్వం ఏర్పడిన తరువాత ఇప్పటి వరకు 30 జాబ్ మేళాలు నిర్వహించామని అన్నారు. దాదాపు 150 కంపెనీల ద్వారా 1,536 మందికి ఉద్యోగాలను కల్పించామని పేర్కొన్నారు. ఈ జాబ్ మేళాలో 48 కంపెనీలు 1426 ఉద్యోగాలు కల్పిస్తాయని వివరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రాష్ట్ర విద్యాశాఖ , ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ ఆశయాల మేరకు 20 లక్షల మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించే లక్ష్యంతో ముందుకు వెళుతున్నట్లు తెలిపారు. జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ మాట్లాడుతూ.. జాబ్ మేళాలు నిరుద్యోగ యువతకు చక్కని అవకాశాలని అన్నారు. కార్యక్రమంలో స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి సంజీవరావు, జెడ్పీ సీఈఓ జ్యోతిబసు, డీఆర్‌డీఏ పీడీ విజయలక్ష్మి, జిల్లా ఎంప్లాయిమెంట్ ఆఫీసర్ దుర్గాబాయి, ప్రత్తిపాడు తహసీల్దార్ దరియావలి, మలినేని లక్ష్మయ్య మహిళా ఇంజినీరింగ్ కళాశాల చైర్మన్ పెరుమాళ్లు పాల్గొన్నారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
(గుంటూరు ఈస్ట్)
90109 57733
Office mail : sakshigntadvt@gmail.com